ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు
5
సోమవారం 4 ఆగస్టు 2025

చెత్తనూ వదల్లేదు..!





- జనం నుంచి ముక్కుపిండి పన్ను వసూళ్లు
- మొదటి ఏడాది 50.2 శాతం ఖజానాకు జమ
- తరువాత 27 శాతమే చెల్లించిన వైనం
- చెత్తపన్నులో రూ.కోట్లల్లో గోల్‌మాల్
- పంచుకున్న పాలకవర్గం, అధికారులు ?

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో క్లాప్ ప్రోగ్రాం అమలైంది. జనం వద్దు వద్దు అని మొత్తుకున్నా లెక్క చేయకుండా చెత్త పన్ను వసూళ్లకు శ్రీకారం చుట్టారు. 2021 జూలై నుంచి క్లాప్ ప్రోగ్రాం అమలైంది. అంతే.. చెత్తకు డబ్బులు వసూలు చేసే కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. గృహాలకు రూ.90, వాణిజ్య సముదాయాలకు రూ.200 నుంచి రూ.5 వేల వరకు సముదాయాన్ని బట్టి నిర్ణయించారు. కార్పొరేషన్‌లో సుమారు 90 వేల నివాసగృహాలు ఉండగా 15 వేల దాకా వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. ఒక్కో గృహానికి రూ.90 చొప్పున వాణిజ్య సముదాయానికి 200 నుంచి రూ.5వేల వరకు వసూలు చేయాల్సి ఉంది. అంటే 90 వేల గృహాలకు రూ.81 లక్షలు, ఇక వాణిజ్య సముదాయాలకు సరాసరిన రూ.500 లెక్క వేసుకున్నా రూ.75 లక్షలు అంటే మొత్తం ఒకటిన్నర కోటి నెలనెలా వసూలు కావాల్సి ఉంది. ప్రోగ్రాం మొదలైన తొలినాళ్లలో కాస్త వసూళ్లు మందగించిందని అనుకున్నా రాను రానూ వసూళ్ల సంఖ్య పెరిగిపోయింది.

ముక్కుపిండి వసూళ్లు

చెత్తపన్ను వసూళ్లలో అధికార యంత్రాంగం జనం నుంచి ముక్కుపిండి వసూళ్లు చేసింది. అప్పటి కమిషనరు సాయిప్రవీణ్‌చంద్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వసూళ్లు చేశారు. గుంపులు గుంపులుగా వసూళ్ల కోసం వెళుతుండడంతో దాదాపు అందరూ పన్నులు చెల్లించారని చెబుతారు. అయితే ఆ వసూలైన సొమ్మంతా కార్పొరేషన్‌కు జమ కాకపోవడం గమనార్హం. కార్పొరేషన్ రికార్డుల్లో చెత్త పన్నుటార్గెట్, వసూలైనది, ఖజానాకు జమ చేసిన లెక్కలు ఇలా ఉన్నాయి.

- 2021 జూలై నుంచి డిసెంబరు వరకు రూ.11,87,940లను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ రూ.2,50,670 వసూలైంది. అంటే టార్గెట్‌లో 21 శాతం వచ్చింది. తొలుత చెత్త వాహనాలు పూర్తి స్థాయిలో పెట్టలేదు.
- 2022-23 జనవరి నుంచి డిసెంబరు వరకు రూ.6,57,13,960లను టార్గెట్‌గా పెట్టుకున్నారు. రూ.3,30,8,680 వసూలైంది. ప్రతినెలా యావరేజ్ 2,86,39,410 చూపించారు.
- 2023 జనవరి నుంచి డిసెంబరు వరకు టార్గెట్ రూ.10,60,54,110 టార్గెట్ కాగా 2,86,39,410 వసూలైంది. అంటే 27 శాతం. నెలకు రూ.23,86,610 వచ్చింది. అప్పట్లో సరాసరిన 50 వాహనాలు పెట్టారు.
- 2024 జనవరి నుంచి ఆగస్టు వరకు 10,53,840 టార్గెట్ కాగా 1,92,910 వసూలైంది. 19.2 శాతం, 20 వెహికల్స్ ఉపయోగించారు.

విస్తుపోయారు..

చెత్తపన్ను రద్దు చేసినా కమర్షియల్ పేరిట శానిటేషన్ విభాగంలో అధికారులు వసూలు చేశారు. ఇది సుమారు రూ.8 కోట్లు ఉండవచ్చని ఓ అంచనా. వైసీపీ కార్పొరేటర్లు కూడా రూ.8 కోట్ల మేర స్కాం జరిగిందంటూ ప్రెస్‌మీట్లు పెట్టి ఆరోపించారు. విశేషమేమంటే పాలకవర్గం వైసీపీ నేతల చేతుల్లో ఉండడం గమనార్హం. చెత్త పన్ను వసూళ్లపై కమిషనరు మనోజ్‌రెడ్డి విచారణ నిర్వహించారు. ఎంహెచ్‌వోను ప్రభుత్వానికి సరెండరు చేయగా, ముగ్గురు రెగ్యులర్ ఉద్యోగుల సస్పెండ్, నలుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించారు. అయితే వైసీపీ కార్పొరేటర్లు కమర్షియల్ నుంచి అధికారులు రూ.8 కోట్ల మేర వసూలు చేశారని బలంగా ఆరోపించారు. ఈ నేపథ్యంలో కమిషనరు ఆరా తీయగా కళ్లు బైర్లు కమ్మే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. క్లాప్ ప్రోగాం అమలైనప్పుడు తొలి ఏడాది 50 శాతం కలెక్షన్లను కార్పొరేషన్ ఖాతాలో జమ చేశారు. టార్గెట్‌లో రాను రానూ 27 శాతం మాత్రమే జమ అయింది. ఎంహెచ్‌వోగా చంద్రశేఖర్ బాధ్యతలు తీసుకున్న తరువాత మరింత తగ్గిపోయింది. జనం నుంచి మాత్రం ముక్కుపిండి వసూలు చేశారు. కానీ కార్పొరేషన్ జమ చేసిన డబ్బుల్లో చాలా తేడా ఉంది. ఈ చెత్తపన్ను వసూళ్లలో కూడా ఖజానాకు కట్టకుండా అధికారులు, కొందరు పాలకవర్గం జేబుల్లో వేసుకున్నారన్న చర్చ నడుస్తోంది. ప్రస్తుత కమిషనరు దీనిపై ఏడు టీంలతో విచారణ చేయిస్తున్నారు. కాగా కమర్షియల్ భవనాల నుంచి చెత్త పన్ను వసూలు చేస్తున్నారని మీడియాలో వార్తలు రావడంతో కమిషనరు ప్రెస్‌మీట్ పెట్టారు. ఎంహెచ్‌వోను ప్రభుత్వానికి సరెండరు చేయడంతో చెత్త పన్ను వసూళ్లలో 27 శాతమే ఖజానాకు కట్టారని చెప్పారు. ఎంహెచ్‌వో సరెండరు కావడంతో కార్పొరేటర్లు ప్రెస్‌మీట్ పెట్టడం గమనార్హం. ఏదేమైనా కార్పొరేషన్‌లో చెత్తనూ వదల్లేదా ? అని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

మేడిపండు చూడు మేలిమైయుండు.. పొట్టవిప్పి చూడ పురుగులుండు అన్న చందంగా.. కడప కార్పొరేషన్ పరిస్థితి తయారైంది. గతంలో ఇక్కడ కమిషనరుగా ఐఏఎస్ ఆఫీసరు సాయిప్రవీణ్‌చంద్ పనిచేశారు. అప్పట్లో పారిశుధ్యం మెరుగుపడింది. ఆయన ఎప్పుడూ ఫీల్డ్ మీద ఉంటూ అధికారులను పరుగులు పెట్టించారు. దీంతో జనాల్లో కూడా కార్పొరేషన్‌పై ఓ సదభిప్రాయం ఉండేది. ప్రస్తుతం కార్పొరేషన్‌లో అవినీతి కంపు వెదజల్లుతోంది. చెత్తపన్ను వసూళ్లలో గోల్‌మాల్ గుబులు రేపుతోంది. చంద్రబాబు సర్కారు చెత్తపన్ను రద్దు చేసినా వాణిజ్య సముదాయాల నుంచి ముక్కుపిండి వసూలు చేశారు. ఇది సంచలనంగా మారింది. ఇందుకు బాధ్యులైన 8 మందిపై ఈ మధ్యే వేటు వేశారు. అయితే ఇప్పుడిప్పుడే విస్తుగొలిపే విషయాలు బయటకు వస్తున్నాయి. జనం నుంచి వసూలు చేసిన సొమ్మును కార్పొరేషన్‌కు చెల్లించకుండా అధికారులు జేబుల్లోకి వేసుకోవడమే ఇప్పుడు పెద్ద హాట్‌టాపిక్‌గా మారింది. రూపాయి రెండు రూపాయలు కాదు.. కోట్లాది రూపాయలు గోల్‌మాల్ అయినట్లు చెబుతున్నారు.

గండికోట ప్రాజెక్టులోకి వేగంగా వస్తున్న కృష్ణాజలాలు



గండికోటకు బిరబిరా కృష్ణమ్మ

- ఇన్‌ఫ్లో 10,165 క్యూసెక్కులు

కొండాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులోకి కృష్ణాజలాలు వేగంగా వస్తున్నాయి. దీంతో ప్రాజెక్టులో రోజురోజుకు నీటిమట్టం పెరుగుతూ వస్తోంది. ఆదివా రం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 10,165 క్యూసెక్కులు ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా గండికోట నుంచి మైలవరం జలాశయానికి 1500 క్యూసెక్కులు, సీబీఆర్‌కు 1,000 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయర్‌కు 400 క్యూసెక్కులు, జీఎన్‌ఎస్‌ఎస్ మెయిన్ కెనాల్‌కు 600 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టులో ప్రస్తుతం 10.98 టీఎంసీల నీరు నిల్వ ఉందని, కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు అని ఈఈ తెలిపారు. ఇదిలా ఉండగా జీఎన్‌ఎస్‌ఎస్ మెయిన్ కెనాల్‌కు 600 క్యూసెక్కుల నీరు వదులుతున్న నేపథ్యంలో ఈఈ ఆదివారం మెయిన్ కెనాల్‌ను పరిశీలించారు. 600 క్యూసెక్కుల నీరు వదులుతున్నప్పటికీ కాలువలో ఇంకా గ్యాప్ ఉందని, ఎటువంటి ఇబ్బంది లేదని తెలిపారు.

6 నుంచి బ్రహ్మంగారి మాస కల్యాణోత్సవం


వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సమేత మాతా గోవిందమాంబ మాస కల్యాణ మహోత్సవాలు ఆగస్టు 6వ తేది నుంచి ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ ఆదివారం తెలిపారు. ఇందుకు గానూ ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా బి.మఠం దేవస్థానంలో ప్రతి నెలా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మంగారి మాస కల్యాణ మహోత్సవాలు ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన కల్యాణమండపంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మహోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాక జిల్లాలు, మండలాలు, గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారన్నారు. ముఖ్యంగా కందిమల్లాయపల్లె గ్రామ ప్రజలు ఈ మాస కల్యాణ మహోత్సవానికి హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు.

నేడు సభాభవన్‌లో పీజీఆర్‌ఎస్

కడప కలెక్టరేట్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సభాభవనంలో సోమవారం డయల్ యువర్ కలెక్టర్, ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్) కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9-30 గంటలకు డయల్ యువర్ కలెక్టర్, 10 గంటల నుంచి పీజీఆర్‌ఎస్ కార్యక్రమాల్లో అర్జీదారులు తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలని సూచించారు. అలాగే మీకోసం కాల్ సెంటర్ 1100 నెంబరుకు ఫోన్ చేసి అర్జీదారులు తమ అర్జీలు పరిష్కారమయ్యాయా ? లేదా? అనే విషయాలను తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పది రోజుల్లో ఆరు సెలవులు

కలికిరి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు నెలలో పది రోజుల వ్యవధిలో ఆరు సెలవులు రానున్నాయి. నెలలో మొత్తం పది రోజులు సెలవులుండగా అందులో పది రోజుల వ్యవధిలో ఆరు సెలవులు రావడం అరుదుగా జరుగుతుంది. ఆగస్టు 8వ తేదీ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం, 9న రెండవ శనివారంతో పాటు రాఖీ పౌర్ణమి, 10వ తేదీ ఆదివారం సెలవులున్నాయి. ఆ తరువాత మళ్లీ 15వ తేదీ శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం, 16 శనివారం శ్రీకృష్ణాష్టమి, 17 ఆదివారం రానున్నాయి. దీంతో మొత్తం పది రోజుల మధ్యలోనే ఆరు సెలవు దినాలున్నాయి. ఇవి కాకుండా మరో మూడు ఆదివారాలు, 27వ తేదీ వినాయక చవితి పండుగలు రావడంతో ఆగస్టులో మొత్తం పది రోజులు సెలవులున్నాయి. శ్రావణ మాసంలో వివిధ రకాల శుభ కార్యాలు వరుసగా రావడంతో సెలవులు కూడా కలిసొచ్చాయి.

ఈశ్వరీదేవి మఠానికి రూ.5 లక్షల విరాళం


ఎమ్మెల్యే ద్వారా చెక్కును అందుకుంటున్న మఠాధిపతి వీరకుమారస్వామి

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞానకర్త మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మనవరాలు జగన్మాత ఈశ్వరీదేవి మఠం పునర్నిర్మాణానికి రూ.5 లక్షల 116లు విరాళంగా అందజేసినట్లు మఠం కార్యనిర్వాహణాధికారి జగన్‌మోహన్‌రెడ్డి పాత్రికేయులకు తెలిపారు. హైదరాబాదుకు చెందిన ఆదిశంకరాచార్య వేద ధర్మపీఠం వ్యవస్థాపకుడు గురుకుల్ పడకంట్ల వెంకటాచార్యులు ధర్మపత్ని సరస్వతి వీరి శిష్యబృందం ఈ మొత్తాన్ని ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాదులో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ చేతుల మీదుగా చెక్కును ఈశ్వరీదేవిమఠం మఠాధిపతులు వీరశివకుమారస్వామికి అందించినట్లు ఆయన తెలిపారు.

ఎర్రబల్లె చెరువుకు నీరందిస్తాం : బీటెక్ రవి


హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాల్వను పరిశీలిస్తున్న బీటెక్ రవి

పులివెందుల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాల్వ నుంచి ఎర్రబల్లె చెరువుకు నీటిని అందించేందుకు ప్రభుత్వంతో చర్చలు జరిపామని అందుకు ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించిందని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. ఆదివారం ఉదయం హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ 420.2 కిలోమీటర్ వద్ద నుంచి ఎర్రబల్లె చెరువుకు నీటిని మళ్లించేందుకు అక్కడి ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ 420.2 కిలోమీటర్ల దూరం నుంచి నీటిని మళ్లిస్తే 15 కి.మీ. దూరంలో ఉండే ఎర్రబల్లె చెరువుకు నీరు అందుతుందన్నారు. ఎర్రబల్లె చెరువుకు కనీసం నీళ్లు కూడా అందివ్వలేని పరిస్థితుల్లో జగన్ ఉండిపోయారని, పులివెందుల నుంచి ఇద్దరు ముఖ్యమంత్రులు పనిచేసినప్పటికీ ఈ సమస్య దీర్ఘకాలికంగా పెండింగ్‌లోనే ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఈ సమస్యకు పరిష్కారం చూపించిందని తెలిపారు. ప్రస్తుతం ఎర్రబల్లె చెరువుకు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి వచ్చే లింగాల కుడికాల్వ ఎత్తిపోతల ద్వారా చెరువుకు నీటిని అందించేందుకు ఆ ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ నీటిని మళ్లిస్తే రోజుకు 30 క్యూసెక్కుల నీటిని చెరువుకు తరలించవచ్చని తెలిపారు. సీఎం చంద్రబాబు కడప జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇరిగేషన్ అధికారులతో చర్చించి వారికి పలు సలహాలు, సూచనలు సీఎం అందించారన్నారు. దీంతో ఎర్రబల్లె చెరువుకు హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాల్వకు ఎప్పుడు నీరు వచ్చినా యర్రబల్లె చెరువుకు నీటిని వదిలేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈయన వెంట మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, వెంకటరామిరెడ్డి, పుష్పనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెస్ నిర్వాహకులపై ఎమ్మెల్సీ ఆగ్రహం

- విద్యార్థులకు నాసిరకం భోజనం పెట్టడంపై మండిపాటు


విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

వేంపల్లె, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఇడుపుల పాయ ట్రిపుల్‌ఐటీలో మెస్ నిర్వాహకులు పీయూసీ విద్యార్థులకు పురుగుల అన్నం పెట్టడంపై ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నాసిరకం బియ్యంతో విద్యార్థులకు భోజనం అందించడం శోచనీయమని, మెస్ నిర్వాహకుల బిల్లులను నిలిపివేయాలని ట్రిపుల్‌ఐటీ అధికారులకు సూచించారు. మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో శనివారం రాత్రి నాణ్యమైన భోజనం ఇవ్వడం లేదని విద్యార్థులు నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం ట్రిపుల్ ఐటీలోని జైస్వాల్ మెస్‌ను ఎమ్మెల్సీ పరిశీలించారు. బియ్యం, ఇతర ఆహార సరుకులను తనిఖీ చేసి డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏఓ రవికుమార్ ఇతర అధికారులతో చర్చించారు. భోజనం సక్రమంగా అందించడం లేదని పలువురు ఎమ్మెల్సీకి ఫిర్యాదు చేయడంతో మెస్ నిర్వాహకులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం సదుద్దేశంతో లక్షలాది రూపాయలు వెచ్చించి పిల్లలకు భోజనం ఇస్తుండగా మెస్ నిర్వాహకులు సక్రమంగా భోజనం అందించకపోవడం క్షమించరాని నేరమన్నారు. గతంలో కూడా ఎన్నో ఫిర్యాదులు వచ్చాయని, ట్రిపుల్‌ఐటీలలో మెస్‌లను అక్షయపాత్రకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఇప్పటికైనా మెస్ నిర్వాహకులకు అడ్డుకట్ట వేయాలంటే బిల్లులు ఆపాలని అధికారులకు సూచించారు.

అధికారుల సహకారం

- లేనిది ఉన్నట్లు అంతా కనికట్టు
- డిపార్ట్‌మెంటల్ టెస్టు రికార్డుల్లో గోల్‌మాల్



సహకారశాఖ అధికారి కార్యాలయం

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు పదోన్నతులు పొందాలంటే డిపార్ట్‌మెంటల్ టెస్టులు పాస్ కావాల్సి ఉంటుంది. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్‌సీ) తరచూ శాఖాపరమైన పరీక్షలు నిర్వహిస్తుంది. పదోన్నతులకే కాకుండా అదనపు ఇంక్రిమెంట్లకు కూడా ఈ పరీక్షలు కీలకం. ఈ క్రమంలో సహకారశాఖలోని ఒక ఉద్యోగి ఏపీపీఎస్‌సీ నిర్వహించిన డిపార్ట్‌మెంటల్ టెస్టు రాశారు. పాస్ కానప్పటికీ తాను ఉత్తీర్ణత సాధించినట్లు ఏపీపీఎస్‌సీ రికార్డులు సైతం ట్యాంపరింగ్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

జిల్లాలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ హోదాలో సహకార శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి సబార్డినేట్ ఆఫీసర్ల అకౌంటు టెస్టు పార్ట్-1లో ఉత్తీర్ణతపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీనిపై సహకారశాఖ కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో కొన్ని నెలల కిందట పూర్తి అదనపు బాధ్యతలతో జిల్లా సహకారశాఖ అధికారిగా విధులు నిర్వర్తించిన జె.సురేశ్‌కుమార్‌ను విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కోరారు. ఆయన విచారణలో అనేక లొసుగులు వెలుగులోకి వచ్చాయి. పులివెందులలోని కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ ఇన్‌స్పెక్టర్ గతంలో కడప డివిజన్‌లో కోఆపరేటివ్ కార్యాలయంలో పనిచేస్తున్నప్పుడు ఏపీపీఎస్‌సీ 2010లో నిర్వహించిన డిపార్ట్‌మెంటల్ టెస్టు పార్ట్-1 కోసం అకౌంట్స్ టెస్టులో ఉత్తీర్ణుడైనట్లు రికార్డుల్లో ఉంది. ఈ పరీక్షకు 5,801 మంది ఉద్యోగులు ఉత్తీర్ణత సాధించారు. ఈ జాబితాలో పులివెందులలో పనిచేస్తున్న ఉద్యోగి పేరు లేదు. వాస్తవంగా 5,801 మంది ఉత్తీర్ణత సాధిస్తే 5,802 మంది ఉత్తీర్ణులైనట్లు రికార్డులను ట్యాంపరింగ్ చేసినట్టు తెలుస్తోంది. ఏపీపీఎస్‌సీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ఫలితాల కాపీ ప్రకారం ఉత్తీర్ణులైన అభ్యర్థుల జాబితాలో ప్రస్తుతం పులివెందులలో పనిచేస్తున్న ఉద్యోగి హాల్‌టికెట్ నెంబరు లేదని విచారణ అధికారి తన రిపోర్టులో పేర్కొన్నట్లు తెలుస్తోంది.

ఏపీపీఎస్‌సీకే బురిడీ

కేవలం పరీక్షకు అటెండ్ అవగానే తాను పాసైనట్లు రికార్డులను మార్పిడి చేసిన సహకార శాఖ ఉద్యోగి ఏపీపీఎస్‌సీకే బురడీ కొట్టించారు. ఆయనపై వచ్చిన ఫిర్యాదులపై సహకారశాఖ అధికారి ఈ ఏడాది మార్చి 26న ఏపీపీఎస్‌సీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సమగ్రంగా విచారణ చేసిన ఏపీపీఎస్‌సీ కార్యదర్శి నరసింహమూర్తి ఏప్రిల్ 7న జిల్లా సహకారశాఖాధికారికి ఒక నివేదిక సమర్పించారు. రికార్డులను తారుమారు చేసిన ఆ ఉద్యోగిపై శాఖ తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవచ్చని లేఖ రాశారు. అయితే ఇతనిపై ఇప్పటికీ చర్యలు తీసుకోక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో ఇతనితో పాటు మరో ముగ్గురు ఇదే రీతిన రికార్డులు తారుమారు చేసినట్లు సమాచారం. వీటన్నింటిపై రాష్ట్ర అధికార యంత్రాంగం స్పందించాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

ఈ విషయమై జిల్లా సహకారశాఖాధికారి వెంకటసుబ్బయ్యను ఆంధ్రజ్యోతి వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు. ఇన్‌చార్జి అధికారిగా శ్రీలక్ష్మికి బాధ్యతలు అప్పగించారు. ఆమె కూడా సెలవులో వెళ్లగా అన్నమయ్య జిల్లా డీసీవో గురుప్రకాశ్‌కు శుక్రవారం బాధ్యతలు అప్పగించారు. ఆయన కూడా అందుబాటులో లేరు.

కబ్జాదారుల కబంధ హస్తాల్లో

రంగసముద్రం చెరువు



రంగసముద్రం చెరువు

- ఆక్రమణలు తొలగించాలని కొందరు.. అడ్డుపడుతున్న మరికొందరు..
- అధ్వానంగా పంట కాల్వలు ● కూటమి నేతల ప్రయత్నాలు ఫలించేనా?

పోరుమామిళ్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పోరు మామిళ్ల మండలం సర్వే నెంబరు 226లోని 135.5 ఎకరాల్లో రంగసముద్రం చెరువు ఉండగా, సర్వే నెం.227లో 41.1 ఎకరాలు, సర్వే నెం.228లో 8.56 ఎకరాలు, సర్వే నెం.916లో 21.48 ఎకరాలు, సర్వే నెం.1194లో 5.88 ఎకరాల మేరకు లోతట్టు భూములున్నాయి. ఈ చెరువుకు నీరందించే కాలువల నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవ డంతో చెరువుకు నీరు అందడం ఆగిపోయింది. దీంతో అడవిని తలపించేలా చెరువులో కంప చెట్లు పెరిగిపోయాయి. దీనిని అదునుగా చేసు కుని కొందరు చెరువును ఆక్రమించేందుకు ప్ర యత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చెరువుకు హద్దులు చూపించాలంటూ ఇటీవల సాగు నీటి సంఘం చైర్మన్ తో కలసి కొందరు కూటమి నేతలు, ఆర్డీవో, కలెక్టరుకు విన్నవించారు. వారి ఆదేశాల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికా రులు సంయుక్తంగా సర్వే నిర్వహించి చెరువుకు హద్దులు నిర్ణయించడంతోపాటు ఆక్రమణలను నిర్ధారించారు.

> చెరువుల అభివృద్ధిని ప్రభుత్వం మరచిపోవడంతో వాటిలో ముళ్ల పొదలు పెరిగిపోయాయి. అజమాయిషీ లేకపోవడంతో పరపతి ఉన్నవారు చెరువు భూములను ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. మరికొందరు పట్టాలు సృష్టించి, వాటిని విక్రయించేందుకు కూడా ప్రయత్నించారు. అభ్యంతరాలు ఎదురుకావడంతో తాత్కాలికంగా తమ ప్రయత్నాలకు విరామం ప్రకటించారు.

ఆక్రమణదారుల్లో అధికార పార్టీ నేతలు..

చెరువుకు సంబంధించి సర్వే నెంబరు 226లోని 135 ఎకరాల్లో దాదాపు 35 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైందన్న ఆరోపణలు ఉన్నాయి. సర్వే నెంబరు 227లోని 21 ఎకరాలకు కొందరు పట్టాలు కూడా పొందారు. వీటిలో పార్కు ఎదు రుగా ఉన్న భూముల్లో తమకు పట్టాలున్నాయని, ఎన్నో ఏళ్లుగా వాటిని తాము సాగు చేసుకుంటున్నా మని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూములను దక్కించుకునేందుకు కొందరు ప్రయత్నించగా, వాటిని విక్రయించేందకు కూడా కొందరు సిద్ధపడ్డారు. అయితే, ఇటీవల సర్వేలో నిర్ధారించిన ఆక్రమణలు తొలగించాలని టీడీపీకి చెందిన కొందరు పట్టుబడుతుండగా, ఆక్రమణ దారుల్లో ఇతరులతో పాటు అధికార పార్టీకి చెందిన వారు కూడా ఉండడంతో సమస్య జటిలంగా మారింది. ఈ భూముల్లో పట్టాలు పొందిన వారికి అధికారులు నోటీసులు జారీ చేయగా ఆర్డీవో కోర్టులో విచారణ కూడా చేశారు. అయితే, రెవెన్యూ అధికారులు మంజూరు చేస్తేనే తమకు పట్టాలు అందాయని, తమ ఇంట్లో ఏమైనా రెవెన్యూ కార్యాలయం ఉందా, ఆన్‌లైన్, రెవెన్యూ రికార్డుల న్నీ రెవెన్యూ కార్యాయలంలోనే ఉంటాయి కదా, భూములు కేటాయిం చేటపుడు ఈ భూములు చెరువు లోతట్టు భూములని ఆ అధికారులకు తెలియదా అని కొందరు నేతలు ప్రశ్నించారు కూడా..

అభివృద్ధితోనే ఆక్రమణలకు చెక్..

చెరువుకు నీరందించే కాల్వలు కూడా ఆక్రమణలబారిన పడాయని, వీటిని పునరుద్ధరించి చెరువుకు నీరందిస్తే, ఈ ఆక్రమిత భూములన్నీ నీటిలో మునిగిపోతా యి కదా, ఆ మేరకు ఎందుకు చర్యలు తీ సుకోవడం లేదని కొందరు ప్రశ్నిస్తున్నా రు. చెరువు ఎండి పో వడంతో ఖాళీగా ఉన్న భూములను మాత్రమే సాగు చేసుకుంటున్నారని, చెరువు నీటితో నిండితే ఆ అవ కాశం ఉండదని, కాల్వలను పునరుద్ధ రించి, పెరిగిపోయిన కంపచెట్లను తొలగించి చెరువులో పూర్తిస్థాయిలో నీరు నింపాలని పలువురు కోరుతున్నారు.

ఆక్రమణలు తొలగిస్తాం

రంగసముద్రం చెరువులో ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకుంటాం. అనుమతులు లేకుండా పొందిన విద్యుత్ కనెక్షన్లు తొలగించాలని ఇప్పటికే విద్యుత్ అధికారులకు నోటీసులు జారీ చేశాం. చెరువు లోతట్టు భూముల్లో అక్రమంగా పట్టాలు పొందిన ముగ్గురి పేర్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగించాం. మిగిలిన సాంకేతిక సమస్యలను కలెక్టరు దృష్టికి తీసుకువెళ్లి ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

-చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దారు, పోరుమామిళ్ల



చెరువుకు నీరందించే కాలువలో పెరిగిన ముళ్లపొదలు

రైతులు కూడా గ్రూపులు ఏర్పాటు చేయొచ్చు

- సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ దుర్గమ్మ



రైతులకు సూచనలిస్తున్న సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ దుర్గమ్మ

మదనపల్లె, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాల తరహాలో రైతులూ గ్రూపులు ఏర్పాటు చేసుకోవచ్చని సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఏ.ప్రవీణ్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(సింగిల్‌విండో)లో ఆదివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల ఏర్పాటు ద్వారా రైతులు పంటల సాగు, పంట ఉత్పత్తులకు అయ్యే వ్యయాన్ని తగ్గించుకోవడంతో ఎక్కువ లాభాగాలకు విక్రయించుకునే అవకాశాన్ని వివరించారు. సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ దుర్గమ్మ మాట్లాడుతూ పీఎం.కిసాన్- అన్నదాత సుఖీభవలో డబ్బులు రాని రైతులు స్థానికంగా ఉన్న రైతు భరోసా కేంద్రాలు లేదా టోల్‌ఫ్రీ నంబర్ 155251ను సంప్రదించాలని సూచించారు. ఈకేవైసీ, ఎన్‌పీసీఐ, తదితర సాంకేతిక సమస్యలు ఉండే అవకాశముందని ఆమె తెలిపారు. సింగిల్‌విండో సీఈవో పి.కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ రెండేళ్లలోనే తాము రూ.11కోట్లు బంగారు రుణాలు ఇచ్చి రికార్డు సృష్టించినట్లు తెలిపారు. బ్యాంకు నుంచి త్వరలో మరిన్ని సేవలు, వ్యాపారులు అందుబాటులోకి తేనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈకార్యక్రమంలో అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి సి.రఘునాథరెడ్డి, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

లైన్ సోయింగ్‌తో వరిలో అధిక దిగుబడి



లైన్ సోయింగ్ పద్ధతిలో వరి నాట్లు వేస్తున్న రైతులు

వాల్మీకిపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): లైన్ సోయింగ్ పద్ధతి పాటిస్తే వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చునని క్రాప్ డైవర్ట్ బ్లాక్ కోఆర్డినేటర్ రాజా రెడ్డి తెలిపారు. ఆదివారం మం డలంలోని చింతపర్తి గ్రామ పంచాయతీలో ఉన్న ఎర్రగుంట్ల బావి గ్రామంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పరివర్తన్ సౌజన్యంతో, వెంకటేశ్వర విత్తన కమిటీ, వాసన్ సంస్థ ఆధ్వర్యంలో అవ గాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గిరీష్‌కుమార్‌రెడ్డికి చెందిన 50 సెంట్ల విస్తీర్ణంలో దేశవాళీ వరి నారును భీజాంమృతంతో శుద్ధి చేసి లైన్ సోయింగ్ పద్ధతిలో నాటించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పద్ధతిలో నాటిన వరి పైరుకుతెగుళ్లు సోకవని, గాలి, వెలుతురు బాగా అందడంతో ఏపుగా పెరిగి అధిక దిగుబడులు వస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నంద్యాల బిషప్‌గా ముద్దనూరు సీఎస్ఐ చర్చి ఫాదర్



సంతోష్ ప్రసన్న

ముద్దనూరు/కలసపాడు ఆగస్టు3(ఆంధ్రజ్యోతి):ముద్దనూరు ఎస్‌పీజీ (సీఎస్ఐ) చర్చి ఫాదర్ సంతోష్ ప్రసన్నరావు బాబు నంద్యాల డయాసిస్ బిషప్‌గా ఎన్నికైనట్లు ఎస్‌పీజీ చర్చి యూత్ సంఘం వారు తెలిపారు నంద్యాల డయాసిస్ బిషప్ పదవికి 9మంది పోటీ పడగా నలుగురు ఎంపికయ్యారు. చివరగా చెన్నైలోని మాడ్రేటర్ రూబేను మార్క్ ఆ నలుగురిలో ఫాదర్ సంతోష్ ప్రసన్న రావు బాబు ను బిషప్‌గా ఎంపిక చేశారన్నారు. సంతోష్ తల్లిదండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులు. మంగళవారం నంద్యాల కేథడ్రల్ చర్చిలో సంతోష్‌కు బిషప్ పట్టాభిషేకం జరగనున్నట్లు బంధువులు తెలిపారు. బిషప్‌గా సంతోష్ ఎంపిక కావడం పట్ల కలసపాడు చర్చి కమిటీ, బంధువులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అదృశ్యమైన మహిళ ఆత్మహత్య



నాగజ్యోతి మృతదేహం

దువ్వూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కనిపించకుండా పోయిన ఓ మహిళ మృతదేహం ఆదివారం కేసీ కాలువలో లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు తన భార్య నాగజ్యోతి (27) కనిపిం చడం లేదంటూ దువ్వూరులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన హరి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసీ కాలువ వద్ద ఆమె చున్నీ కనిపించడంతో ఆత్మహత్యకు పాల్పడిందేమోనన్న అనుమానం తో కేసీ కెనాల్ అధికారులతో మాట్లాడి కాలువలో ప్రవాహం తగ్గించారు. దీంతో ఆదివారం ఉదయం భీమునిపాడు స్లూయిస్ వద్ద ఆమె మృతదేహం తేలింది. మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆత్మహత్యతో ఆమె ఇద్దరు కూతుళ్లు అయిదేళ్ల తన్విక, మూడేళ్ల నైనిక తల్లిప్రేమకు దూరమయ్యారు.

బుద్ధుడి విగ్రహం ధ్వంసంపై చర్యలు తీసుకోవాలి

- డీపీఐ నేత తిరుమావళవన్ ఆగ్రహం



మీడియాతో మాట్లాడుతున్న డీపీఐ నేత తిరుమావళవన్

చెన్నై, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె సమీపంలో ఉన్న కొండపై బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన శక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం నగరంలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుమారు 20 సంవత్సరాల నుంచి మదనపల్లెలో బుద్ధ పూర్ణిమ కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీపీఐ ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారని, ఆయనను రాజకీయంగా ఎదుర్కొలేక కొంతమంది ఆ విగ్రహాన్ని ధ్వంసం చేశారని, ఆ సంఘటనను ఖండిస్తూ ఆందోళనకు దిగిన శివప్రసాద్‌పై కేసులు నమోదు చేయడం గర్హనీయమన్నారు. బుద్ధుని విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను అరెస్టు చేసి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ చర్యలను ఖండిస్తూ ఆగస్టు 23 న విజయవాడలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డీపీఐ పార్టీ నిర్వాహకులతో కలిసి ధర్నా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో పార్టీ నేతలు బాలసింగం, వన్నియరసు, పీటీఎం శివప్రసాద్, యూ.గణపతి తదితరులు పాల్గొన్నారు.

అతిగా మద్యం తాగి ఇద్దరు మృతి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి):వేరువేరు ప్రాంతాల్లో మద్యానికి బానిసలైన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మండలంలోని బసినికొండకు చెందిన లక్ష్మన్న కుమారుడు పవన్(40)కు పదేళ్ల క్రితం భారతితో వివాహం జరిగింది. పెళ్లైన ఏడాదికే ఆమె మృతి చెందగా, అప్పటి నుంచి మద్యానికి బానిసై పనులకు వెళ్లకుండా ఉండేవాడని, ఆదివారం బసినికొండ పెట్రోల్ బంకు సమీపంలో మద్యం అతిగా తాగి అక్కడే పడి చనిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పట్టణంలోని మార్పురి వీధికి చెందిన ఖాదర్ బాషా కుమారుడు షరీఫుద్దీన్ (38)మద్యానికి బానిసయ్యాడు. అతని భార్య హమీదా కూలి పనులు చేస్తుండగా, ఇతను చెడు తిరుగుళ్లు తిరుగుతూ ఉండేవాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం భార్య పనికి వెళ్లి వచ్చేసరికి భర్త అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే అతనిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని ఇంటికి తరలించారు

ఆసక్తికరంగా జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు



పరుగు పోటీలో పాల్గొన్న క్రీడాకారులు



హైజంప్ చేస్తున్న యువకుడు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో అండర్-14, 16 జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ఆసక్తికరంగా సాగాయి. బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడవ తేదీ ఉదయం జరిగిన పోటీలకు జిల్లా వ్యాప్తంగా 350 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలబాలికలకు 60, 600 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, జావెలిన్ త్రో, షాట్‌పుట్, హైజంప్, ట్రైయథ్లాన్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందినవారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. పోటీల్లో ప్రతిభ కనపరిచిన 30 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారు ఈనెల 9, 10, 11 తేదీల్లో బాపట్లలో జరిగే ఏపీ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ కార్యదర్శి అహమర్‌బాష తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ సంచాలకులు నాగూర్‌బాష, శివారెడ్డి, శంకర్, నరేష్, ఎర్రన్న, చందు, నాగేశ్వరరావు, ఖాదర్‌రెడ్డి, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

విభిన్నప్రతిభావంతులకు పరికరాలు



దివ్యాంగుల అర్హత పత్రాలను పరిశీలిస్తున్న అధికారి అజయ్

కడప కలెక్టరేట్, ఆగస్టు 3,(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు, విభిన్న ప్రతిభావంతులకు పరికరాలు పంపిణీ చేస్తోందని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలనీ అధికారి అజయ్ సూచించారు. ఆదివారం శంకరాపురంలోని అంధుల పాఠశాలలో జేకే వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పఠాన్ ఖాదర్ బాషాతో కలసి దివ్యాంగుల దరఖాస్తులను పరిశీలించి, ఆన్లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం సౌజన్యంతో కాన్పూర్‌కు చెందిన కృతిమ అవయవాల తయారీ సంస్థ, విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమ శాఖల సంయుక్తంగా చేతి కర్రలు, మూడు కాళ్ల చేతికర్రలు, వాకర్లు, నాలుగు కాళ్ల చేతి కర్రలు, చంక కర్రలు, వీల్ చైర్లు, ట్రైసైకిళ్లు, బ్యాటరీ ట్రైసైకిళ్లు. వినికిడి పరికరాలతో పాటు రోలేటర్లు, ఎమ్మెస్ కిట్లు, అంధులకు వాచీలు, వాయిస్ ఫోన్లు తదితర పరికరాలను అందజేస్తారన్నారు.

యువకుడిపై కత్తితో దాడి

- పరారీలో నలుగురు యువకులు



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న చాన్‌బాషా

కడప క్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):కడప నగరం మురాదియా నగర్‌కు చెందిన షేక్ చాన్‌బాషాను కత్తితో పొడిచి గాయ పరిచినట్లు తాలూకా పోలీసులు తెలిపారు. బాధితుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు చాన్‌బాషా వంట పనులు చేయడంతోపాటు సాయంత్రం పూట జీవాలు మేపుతుంటాడు. ఆది వారం సాయంత్రం జీవాలు మేపే సమయంలో గుర్రాల గడ్డ ప్రాంతం నుంచి వచ్చిన నలుగురు యువకులు చాన్‌బాషాతో గొడవకు దిగారు. ఆపై వారి వద్ద ఉన్న కత్తితో మూడు చోట్ల పొడిచి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న తెలిపారు.

టీడీపీ నాయకుడిపై వైసీపీ వర్గీయుల దాడి



దాడిలో గాయపడిన చుక్కా కొండయ్య తదితరులు

నందలూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపును అందరికీ అనుకూలమైన ప్రదేశానికి మార్చాలని డిమాండ్ చేసినందుకు టీడీపీ నాయకుడు చుక్కా కొండయ్య, మరికొంతమందిపై వైసీపీ నాయకులు దాడి చేశారు. ఈ సంఘటన చింతకాయల పల్లెలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు... చింతకాయలపల్లెకు చెందిన రేషన్ షాపు కుందానెల్లూరులో ఉంది. ఆ గ్రామంలో 50 రేషన్ కార్డులు మాత్రమే ఉన్నాయి. చింతకాయలపల్లె, మదనమోహనపురం, కొత్తచాపల వారిపల్లె గ్రామాలకు చెందిన సుమారు 600 మంది రేషన్‌కార్డుదారులు కుందా నెల్లూరుకు వెళ్లి రేషన్ తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ షాపును చింతకాయలపల్లెలో ఏర్పాటు చేస్తే అందరికీ అందుబాటులో ఉంటుందని టీడీపీ నేత చుక్కా కొండయ్య సంబంధిత అధికారులకు విన్నవించారు. ఈ విషయం తెలిసిన చింతకాయలపల్లెకు చెందిన వైసీపీ నాయకుడు గంగినాయుడు ఆయన బంధువులు సుమారు 20 మంది చుక్కా కొండయ్య, అతని బంధువులపై దాడికి పాల్పడ్డారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసుల ఎదుట కూడా తమపై దాడి చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

నాడు ఊరికే తలమానికం..

నేడు శిథిల గృహం!

- ములకలచెరువులో మొట్టమొదటి కట్టడం





ములకలచెరువు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బ్రిటిష దొరలు మార్గమధ్యంలో సేదతీరేందుకు 120 ఏళ్ల క్రితం నిర్మించుకున్న కట్టడం కారణంగానే ములకలచెరువు గ్రామం ఏర్పడింది. చాలా కాలం వరకూ ఒక వెలుగు వెలిగిన ఈ భవనం పట్టించుకునేవారు లేక ప్రస్తుతం శిథిల గృహంగా దర్శనమిస్తోంది. ములకలచెరువులోని బస్టాండు సర్కిల్ సమీపంలోని ముంబై - చెన్నై జాతీయ రహదారి పక్కన ప్రస్తుతం ఓ పాడుబడిన ఓ బంగ్లా కనిపిస్తుంది. ఇక్కడ ఊరే లేని సమయంలో ఈ మార్గంలో రాకపోకలు సాగించే తెల్లదొరలు తాము విశ్రాంతి తీసుకునేందుకు ఇక్కడ బంగ్లాను నిర్మించారు. కాలక్రమంలో ఇక్కడ రైల్వేస్టేషన్ నిర్మించడంతో ఊరు ఏర్పడింది. బ్రిటిష దొరల తరువాత ఈ మార్గంతో వెళ్లే మంత్రులు, ముఖ్య నాయకులు, ఉన్నతాధికారులు ఇక్కడే విశ్రాంతి తీసుకునేవారు. ప్రస్తుతం నిర్వహణ లేకపోవడంతో బంగ్లా రూపు రేఖలే మారిపోయాయి. పాలకులెవరూ పట్టించుకోక పోవడంతో ఎందుకూ పనికిరాకుండా పోయింది. బంగ్లా గోడలు కూలిపోతున్నాయి. బంగ్లా ఆవరణ చెత్తాచెదారంతో నిండిపోయింది. పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో అక్కడ బంగ్లా ఉన్న ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. బంగ్లా ముందు దుకాణాలు ఏర్పడడంతో కనుమరుగైంది. ఉన్నతాధికారులు స్పందించి ఈ బంగ్లాను పునరుద్ధరించడమో, దీన్ని తొలగించి కొత్త భవనాలు నిర్మిస్తే ఏదైనా ప్రభుత్వ కార్యాలయానికి వినియోగించుకోవచ్చని స్థానికులు చెబుతున్నారు.

చెరువుకు నీరు ఏటా ఆలస్యమేనా..?

● ఒక్క ఏడాదైనా రెండు పంటల సాగుకు అవకాశం లేదా..? ● ఆవేదన చెందుతున్న కొండపేట రైతులు

చెన్నూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష కాలంలో నిర్మించి అగ్రిమెంటు చెరువుగా ఉండే మండలంలోని కొండపేట చెరువుకు ఏటా నీరు ఆలస్యమవుతుంది. ఒక్క ఏడాది కూడా చెరువ కింద రెండు పంటలు సాగు చేసిన దాఖలాలు లేవని చెప్పవచ్చు. దీంతో రైతులు ఈ చెరువ కింద ఒక్క మారైనా రెండు పంటలు సాగు చేస్తామా అంటూ రైతులు చర్చించుకుంటున్నారు. మండలంలో సాగుకు అవకాశం ఉన్న చెరువులు రెండే రెండు. ఒకటి రాచిన్నాయపల్లె చెరువ కాగా,రెండోది కొండపేటచెరువు. దాదాపు 90 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువ కింద సుమారు 500 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆయకట్టు అయితేఉంది కానీ, పంట సాగు మాత్రం డిసెంబరు, జనవరిలోనో అంత వరకు సాగు చేపట్టే అవకాశం లేదు. అగ్రిమెంటు చెరువుగా ఉన్నప్పటికీ చెరువుకు మాత్రం ప్రతి ఏటా నీరు ఆలస్యంగా వస్తోంది. పైగా చెరువుకు ఇచ్చే నీరు ముందే ఇస్తున్నామని అధికారులు చెబుతున్నా ఆ నీరు అరకొర ఇస్తూ అది నిండే సరికి నెల నుంచి రెండు నెలలు పడుతుంది. దీంతో రైతులు సరైన సమయానికి ఒక్క ఏడాది కూడా ఖరీఫ్‌లో వరి సాగు చేసుకోలేని పరిస్థితి వచ్చింది. 90 ఎకరాలపైగా విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువుకు ప్రస్తుతం సగం మాత్రమే నీరు వచ్చింది. ఇక మిగిలిన సగం పూర్తిగా నింపండి, వరి సాగు చేసుకుంటామని రైతులు కోరుతున్నా అది ఎప్పుడు నిండుతుందో, నిండేందుకు ఇంకెంత గడువు పడుతుందో తెలియని పరిస్థితి. ఫలితంగా చెరువు కింద రైతులు సేద్యం చేసుకుని పొలాన్ని బీడుగా పెట్టుకున్నారు.



నేటికీ సగం నీరే ఉన్న కొండపేట చెరువు

నిండింది సగం చెరువే..: కేసీ కెనాల్‌కు ఈ ఏడాది ముందుగానే నీరు వదిలారు. నీరు వదిలేటప్పుడే కొండపేట చెరువు అగ్రిమెంటు చెరువు కాబట్టి కాసింత ముందుగానే వదిలితే చెరువు నిండి ఖరీఫ్‌లో పంటలు సాగు చేసుకుంటారు. చెరువు నిండేదెన్నడు, సాగు చేసేదెప్పుడు అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్యాంల్లో నీరు వుంది. నదుల్లో పుష్కలంగా ఉన్నాయి. అయినా చెరువుకు ఇంత ఆలస్యంగా నీరు వదలడం ఏమిటని అంటున్నారు. అధికారులు స్పందించి చెరువు పూర్తిగా నింపితే వ్యవసాయ పనులు వేగవంతం చేసుకుంటామని చెబుతున్నారు.

అవసరమైతే చెరువు నిండుగా నీరు నింపుతాం

రైతులు కోరితే చెరువు నిండా నీరు నింపుతాం. ఇప్పటికైతే 65 శాతం చెరువు నిండింది. ఎలాంటి డోకా లేకుండా నార్లు పోసుకోవచ్చు. పూర్తిగా నింపితే వర్షం కురిసినా కొండ నీరంతా చెరువుకు వస్తుంది. అలాగే కాల్వకు వదిలే నీరు చెరువుకే ఈ రెండింటి వల్ల చెరువు పూర్తిగా నిండి రైతులకు ఇబ్బంది అవుతుంది. నీటిని అలుగు ద్వారా వదిలితే రైతులు ఇంత నీరు వదిలారేమని అడుగుతున్నారు. ఈమారు అయితే ఇబ్బంది లేకుండా చేస్తాం, ఇప్పటికి అయితే సాగు చేసుకోవచ్చు.

- సుబ్బరాయుడు, ఏఈ, కేసీ కెనాల్



సేద్యం చేసుకుని సిద్ధంగా ఉన్న పొలాలు

చేయి..చేయి కలుపుదాం..

కోనేరు శుభ్రం చేసిన గ్రామస్థులు



సీకేదిన్నె, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురుచూడకుండా ఆ గ్రామప్రజలు చేయి.. చేయి... కలిపి పూడికతో నిండిన కోనేరును శుభ్రం చేశారు. అంతేగాక ప్రాచీన కట్టడాలను మనమే సంరక్షించుకుని కాపాడుకోవాలని తెలిపి పలువురికి ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళితే... చింతకొమ్మదిన్నె మండలం బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద పురాతన కోనేరును గ్రామస్థులు ఆదివారం పూడిక తీశారు. బుగ్గమల్లేశ్వర ఆలయానికి కార్తీకమాసంలో శివరాత్రికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పూజలు నిర్వహిస్తుంటారు. ఎంతో పురాతనమైన ఆలయానికి సమీపంలో ఉండే కోనేరు కొన్నేళ్లుగా పాడుబడిపోయింది. పూర్వం భృగుమహర్షి తపస్సు చేసి ఇక్కడ ఆలయాన్ని నిర్మించారని, అందువలనే ఇక్కడ బుగ్గమల్లేశ్వరస్వామిగా స్వామి కీర్తించబడుతున్నారని భక్తుల విశ్వాసం. ఇంత పురాతనమైన ఆలయాన్ని సమీపంలోని పూడికతీత కార్యక్రమానికి స్థానికులు గూడా ప్రభాకర్‌రెడ్డి, సదానందరెడ్డి, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితర గ్రామస్థులు, ఆర్ఎస్ఎస్ సభ్యులు, మహిళలు పిల్లలు పాల్గొని పూడికతీత కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారు.

గంగమ్మ తల్లికి పూజలు

సీకేదిన్నె, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె గంగమ్మ తల్లికి భక్తులు ఆదివారం పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. కోరిన కోర్కెలు నెరవేరడంతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. నూతన వస్త్రాలు, పూలదండలు, నిమ్మకాయల దండలతో అమ్మవారిని అలంకరించి చల్లంగా చూడాలని, పాడిపంటలు పండాలని వేడుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు ఏర్పాటుచేసి ఆనందంగా గడిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ చిన్నయ్య

పులివెందుల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా పలు పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆర్డీఓ చిన్నయ్య పరిశీలించారు. ఆదివారం ఉదయం తహసీల్దార్ నజీర్ అహ్మద్, అర్బన్ సీఐచాంద్ బాష నల్లపురెడ్డిపల్లె తదితర పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పోలింగ్ కేంద్రాలకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలకు లోబడి ఈ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించాలని అధికారులకు వివరించారు.

'అధికారులను మాత్రమే బాధ్యులను చేశారు'



కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): చెత్త పన్ను వసూలులో కిందిస్థాయి అధికారులు మాత్రమే బాధ్యులను చేశారని అసలుదోషులు ఎవరో నిగ్గు తేల్చాలని 47వ డివిజన్ కార్పొరేటర్ పాకా సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కడపనగరం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెత్త పన్ను వసూలు చేయడం మొదలు పెట్టినపుడుకనీసం పాలకవర్గం అనుమతి తీసుకోలేదని, అప్పటి పాలకవర్గం సభ్యులు అయిన తాము ప్రెస్‌మీట్ పెట్టి వసూలు చేయకూడదు ఒక వేళచేసినా రూ.50 మాత్రమే వసూలు చేయాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపామన్నారు. కానీ అప్పటి అదికారులు మా తీర్మాణాలు అమలు చేయకుండా వసూల్లు చేశారన్నారు.

నేటి తరానికి ఆదర్శం ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి

కడపసెవెన్ రోడ్స్ ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నేటి తరానికి ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి ఆదర్శవంతుడని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర కొనియాడారు. ఆదివారం స్థానిక ఎర్రముక్కపల్లె సర్కిల్ వద్ద జరిగిన ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి వర్ధంతిలో ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కృష్ణమూర్తి, కేసీ బాదుల్లా, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

కమలాపురం రూరల్..: జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాత ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి జీవితం ప్రజాసేవకే అంకితమైందని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు జి.వేణుగోపాల్ తెలిపారు. ఆదివారం కామ్రేడ్ ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా కమలాపురంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి నాగేశ్వర్‌రావు, సహాయ కార్యదర్శి వరప్రసాద్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

సిద్దవటం ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడిగా సుబ్బారెడ్డి

కడప కలెక్టరేట్,ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో సంఘ సిద్దవటం తాలూకా యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఆదివారం కడప ఎన్జీవో సంఘ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడుగా సుబ్బరాయుడు, కార్యదర్శిగా హైమావతిలతో పాటు 12మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు హాజరయ్యారు ఎన్నికల అధికారిగా తిమ్మారెడ్డి, పరిశీలకులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి డి. రవికుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నేతలు ప్రసాద్ యాదవ్, నిత్య పూజయ్య, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలోనే క్రీడలకు పెద్దపీట



మాట్లాడుతున్న శాప్ డైరెక్టర్లు

కడప స్పోర్ట్స్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వ పాలనలోనే క్రీడలకు పెద్దపీట వేస్తున్నట్లు శాప్ డైరెక్టరు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమణారావు, రవీంద్రనాథ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కడపలో ఉన్న వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూలును సందర్శించినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సాజిద్, నాగరాజారెడ్డి చంద్రావతి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆర్థిక విషయాలపై ఉద్యమిస్తాం : ఆపస్

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఆర్థిక విషయాలపై ప్రభుత్వం ఉద్యమించక తప్పదని ఆపస్ ప్రతినిధులు హెచ్చరించారు. కడప నగరం నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల సమావేశ హాలులో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా శాఖ సమావేశంలో ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేల్పుల రామాంజనేయప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శెట్టెం చెన్నయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, రాష్ట్రకార్యదర్శి సుబ్బరాయుడు, రాష్ట్ర సేవ ప్రముఖ్ ఎరుకలరెడ్డి, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా గౌరవాధ్యక్షుడు బాలానాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇతర ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

శక్తియాప్ సేవలు వినియోగించుకోండి

కడప క్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శక్తియాప్ మహిళలు, బాలికల రక్షణకు ఆపద సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని రిమ్స్ పీఎస్ ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్ అన్నారు. శక్తియాప్ ఆవశ్యకత ప్రాధాన్యం గురించి ఆదివారం సాయంత్రం కడప నగర శివార్లలోని శిల్పారామం సందర్శకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్‌మోసాలపై డయల్ 112, చైల్డ్ లైన్ 1098, గృహహింస 181, మహిళా వేధింపులు 1091, సైబర్ టోల్‌ఫ్రీ 1930, సైబర్ మిత్ర ద్వారా పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ఇంటర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా కె.సురేష్, వెంకటసుబ్బయ్య ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం కడప ప్రభుత్వ జూనియర్ కళాశాల (గర్ల్స్)లో ఎలక్షన్ ఆఫీసర్ ఎన్.నిత్యపూజయ్య ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడిగా కె.సురేష్,కార్యదర్శిగా వెంకటసుబ్బయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్.ఖాదర్‌హుస్సేన్,జాయింట్ సెక్రటరీ ఎస్.మల్లికార్జునరాజు, ట్రెజరర్‌గా వై.రాధాకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.శివప్రసాద్, ఉమెన్ సెక్రటరీగా ఎం.ఇందుమతి ఎంపికైనట్లు ప్రకటించారు. ఈసీ మెంబర్లుగ బాల నర్సయ్య, ఎం.శివప్రసాద్,చరణ్ ఎంపికయ్యారు. అనంతరం వారి చేత ప్రమాణస్వీకారం చేయించారు.

ప్రతిభను మెరుగుపర్చుకుంటేనే ఉన్నతస్థాయి

లింగాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మనం ఏ రంగంలో పనిచేస్తున్న అక్కడ విజయం సాధించాలంటే ఎప్పటికప్పుడు మన ప్రతిభను మెరుగుపర్చుకుంటేనే ఉన్నతస్థాయికి చేరుకోగలమని లింగాల ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి అన్నారు. ఆదివారం కళాశాలలో జాబ్‌మేళ నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో డిక్సన్, తోషిబా, హీరో, బజాజ్, గీకాయ్ కంపెనీలు పాల్గొన్నాయి. ఇంటర్వ్యూలకు 56 మంది హాజరుకాగా అందరికీ ఉద్యోగాలు లభించాయని ప్రిన్సిపాల్ తెలిపారు. అభ్యర్థులకు ప్రారంభంలో రూ.15వేలు జీతం వస్తుందని తెలిపారు.

నేడు దివ్యాంగులు, వయో వృద్ధుల గుర్తింపు శిబిరం

సింహాద్రిపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ పరికరాలకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు సోమవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు సింహాద్రిపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రత్యేక గుర్తింపు శిబిరం ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కృష్ణమూర్తి ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారికి భారత ప్రభుత్వ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ(ఏఎల్ఐఎమ్‌సీవో) ద్వారా చేతి కర్రలు, వాకర్లు, వీల్ చైర్లు, మూడు చక్రాల సైకిళ్లు, తదితర ఉపకరణాలు అందజేయడం జరుగుతుందన్నారు. శిబిరానికి వచ్చేవారు ధ్రువపత్రాలతో రావాలని ఎంపీడీఓ తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కడప మారుతీనగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కమలాపుర విభాగ అధ్యక్షుడు ఎ.ఓబులేసు పేర్కొన్నారు. ఆదివారం కడపలో గల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించే దిశగా పావులు కదుపుతోందన్నారు. సమావేశానంతరం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కమలాపురంమండల కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో కార్యదర్శిగా రామక్రిష్ణ, ట్రెజరర్‌గా కె.స్వర్ణలత, అసోసియేషన్ ప్రెసిడెంటుగా మనీష్‌కుమార్, వైస్ ప్రెసిడెంటుగా ఎం.ఓబులేసు తదితరులను ఎన్నుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పెండ్లిమర్రి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎగువపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1996-2001 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 24 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని ఒకరికొకరి యోగక్షేమాలను తెలుసుకున్నారు.చిన్ననాటి జ్ఞాపకాలను,చదివిన బడి పరిసరాలను, చదువు చెప్పిన ఉపాధ్యాయులను చూసి భావోద్వేగానికి గురయ్యారు.తమ తోటి విద్యార్థి మరణంతో ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదని తెలుసుకుని అతని సతీమణికి అందరూ విద్యార్థులు కలసి 20 వేలరూపాయలు అందచేశారు.అనంతరం విద్యార్థులు అందరూ కలసి ఉపాధ్యాయులను సన్మానించారు.

'జగన్ పాలనలో పులివెందులకు చేసింది శూన్యం'



ఇంటింటి ప్రచారంలో లతారెడ్డి

పులివెందుల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి తన పాలనలో పులివెందులకు చేసింది శూన్యమని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అచ్చవెల్లి గంగమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి జడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా అదే గ్రామంలో ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అచ్చవెల్లి సర్పంచు షరీఫ్, గంగమ్మ ఆలయ చైర్మన్ కాకర్ల జయచంద్రారెడ్డిలతో పాటు మరికొందరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి)లు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం అచ్చవెల్లి గ్రామంలో జడ్పీటీసీ అభ్యర్థి లతారెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, బీటెక్ రవి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహబూబ్‌బాష, వెంకటరామిరెడ్డి, బీజేపీనాయకుడు లక్షుమయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వం పేదలకు భూపంపిణీ చేస్తేనే నిజమైన అభివృద్ధి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కడపసెవెన్ రోడ్స్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): భూమిలేని గ్రామీణ నిరుపేదలకు భూపంపిణీ చేస్తేనే నిజమైన అభివృద్ధి సాధ్యమని ఏఐఏడబ్ల్యూయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం కడప స్థానిక బాలాజీనగర్‌లోని ఉపాధ్యాయ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూపంపిణీ- సాగునీరు-పారిశ్రామిక అభివృద్ధి అనే అంశం పై సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్ అధ్యక్షతన సామవేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా, చేతి వృత్తిదారుల, కేవీపీఎస్, కార్మిక, ఉపాధ్యాయ,ఉద్యోగ,మహిళ, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులుపాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్స్‌కు వేతనాలు పెంచకపోతే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

కడప సెవెన్‌రోడ్స్ ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ వర్కర్స్‌కు వేతనాలు పెంచకపోతే ఉద్యమాలు చేయడానికి సిద్ధమని అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుబ్బరావమ్మ అన్నారు. కడపలోని అంగన్వాడీ వర్కర్స్ విస్తృత సమావేశం యూటీఎఫ్ ఆఫీస్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024 జూలైలో వేతనాలు పెంచాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందన్నారు. కానీ సంవత్సరం దాటినా వేతనాలు పెంచలేదన్నారు. వేతనాలు పెంచకపోగా యాప్‌ల పేరుతో వేధింపులకు గురిచేయడం జరుగుతోందన్నారు.వేతనాలు పెంచకుంటే ఉద్యమం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవి, మనోహర్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయల్ కాపునాడు రాయలసీమ యూత్ అధ్యక్షుడిగా రాచనేని మధు



చక్రాయపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాయల్ కాపునాడు రాయలసీమ యూత్ అధ్యక్షుడిగా రాచనేని మధు నియామకం అయ్యారు. మండలంలోని కొండవాండ్లపల్లెకు చెందిన మధు మాట్లాడుతూ తనను గుర్తించి పదవి ఇచ్చిన రాయల్‌కాపునాడు అధ్యక్షుడు గంగల వీరాంజనేయులు, యూత్ అధ్యక్షుడు కావలి కృష్ణతేజ, కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కాపు, బలిజ, తెలగ, ఒంటరి, మున్నూరు కాపుకులస్థుల హక్కుల కోసం తన వంతు పోరాటం కొనసాగిస్తానని పేర్కొన్నారు.

ఉపాధిలో శ్మశాన వాటికల అభివృద్ధి

- ప్రథమంగా మైదుకూరు నియోజకవర్గంలో పనులు
- ఒక్కో వాటికకు రూ.20 లక్షలు చొప్పున నిధులు మంజూరు
- ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ చొరవతో అమలు



కృష్ణంపల్లె శ్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులు

దువ్వూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శివుడు కొలువుదీరిన చోటు శ్మశానం అనే నమ్మకం హిందువుల్లో నెలకొని ఉంది. అలాంటి శ్మశాన వాటికలు పలు గ్రామాల్లో లేకపోవడం, ఖనన కార్యక్రమాలు ఎక్కడ పడితే అక్కడ కొనసాగిస్తున్న దృశ్యాలు అరుదుగా కనపడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మైదుకూరు నియోజకవర్గంలో శ్మశాన వాటికల ఏర్పాటు ఇందుకొరకు స్థలాల సేకరణ అక్కడ సౌకర్యాలు కల్పించేందుకు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. స్థల సేకరణ విషయంలో కొన్ని అడ్డంకులు ఎదురవుతున్నా వాటిని అధికమించే విధంగా చొరవ తీసుకుంటున్నారు. శ్మశాన వాటికల్లో ఖనన సమయంలో కాల్చే వేదికల్లో షెడ్ల ఏర్పాటు, ఆచార వ్యవహారాల నేపథ్యంలో వేచి ఉండేందుకు వేదికలు, తలనీలాల సమర్పణ సౌకర్యాలు, నీటి సౌకర్యం, స్నానపు గదులు, ఇతరత్రా వాటి కల్పనకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఒక్కొక్క శ్మశాన వాటికకు రూ.20 లక్షలు చొప్పున ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు కేటాయించారు. జిల్లాలోని మైదుకూరు నియోజకవర్గం పరిధిలో దువ్వూరు, ఖాజీపేట, బ్రహ్మంగారిమఠం, మైదుకూరు, చాపాడు మండలాల్లో నిధులు కేటాయించి శ్మశాన వాటికల్లో సౌకర్యాల కల్పనకు పనులు చేస్తున్నారు. మండలంలో బుక్కాయపల్లె, క్రిష్ణంపల్లి గ్రామాల్లో శ్మశాన వాటికల అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో అయిదు గ్రామాల పరిధిలో వాటి కొరకు మొదటివిడతగా నిధులు మంజూరు చేశారు. మరో అయిదు గ్రామాల పరిధిలో వాటి నిర్మాణ ప్రతిపాదనలు పరిపాలన ఆమోదం కొరకు పంపడం జరిగింది. ఇలా గ్రామాల్లో శ్మశాన వాటికలతోపాటు అక్కడ సౌకర్యాలు కల్పిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

శ్మశాన వాటికలకు రూ.5 కోట్లు మంజూరు

మైదుకూరు నియోజకవర్గంలోని అయిదు మండలాల పరిధిలో శ్మశానవాటికల అభివృద్ధికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.5 కోట్లు మంజూరైనట్లు ఆ పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని 25 గ్రామాల పరిధిలో పనులు చేపట్టేందుకు ఒక్కొక్క వాటికకు రూ.20 లక్షలు చొప్పున కేటాయించి పనులు చేపట్టామని ఆయన వివరించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

మైదుకూరు రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తాగునీటి సమస్యను రూపుమాపేందుకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం 15 వార్డులో తాగునీటి బోరు రిపేరుకు రావడంతో యూనిట్ ఇన్‌చార్జి తుపాకుల రమణ ఆదివారం ఎమ్మెల్యే ఆదేశాలతో మరమ్మతు పనులు చేయించి నీటిని వదిలారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 13 వార్డు నుంచి 24 వార్డు లలో ఎక్కడైన తాగునీటి సమస్య ఉంటే 7013782389 నెంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు.

స్నేహ బంధం చాలా గొప్పది

మైదుకూరు రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి):స్నేహ బంధం చాలా గొప్పదని వాసవీక్లబ్ రీజియన్ చైర్మన్ సూరే సుబ్బరాజ అన్నారు. స్థానిక అమ్మవారిశాలలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని వాసవీ క్లబ్, వనితాక్లబ్ సభ్యులు ఘనంగా జరుపుకొన్నారు. ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకొంటూ స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకొన్నారు. సుబ్రమణ్యం, గోపాల్, రవి, ప్రసాద్, సురేంద్ర, సురేష్, సతీష్, కిషోర్, వనితాక్లబ్ సభ్యులు జ్యోతి, కళ్యాణి, స్వాతి, మయూరి, సులోచన, సుజాత, వాసంతి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడిగా చిన్నసుబ్బారావు



ఆర్యవైశ్య నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కొండపల్లె చిన్నసుబ్బారావును అభినందిస్తున్న ఆర్యవైశ్యులు

బద్వేలుటౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్యవర్తక సంఘం నూతన అధ్యక్షుడిగా కొండపల్లె చిన్నసుబ్బారావు 84ఓట్లతో ఘన విజయం సాధించారు. బద్వేలులో ఆర్యవైశ్యవర్తక సంఘం అధ్యక్షుడి పదవీకాలం ముగియడంతో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారిశాల వీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రారంభంకాగా, మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించారు. పట్టణంలోని ఆర్యవైశ్య వర్తకసంఘం ఎన్నికల్లో 1120ఓట్ల వినియోగించుకోవాల్సి ఉండగా, వారిలో 1075 మంది ఓటర్లు పాల్గొని ఆర్యవైశ్యవర్తకసంఘం అధ్యక్షుడికి ఎన్నికలు వేయడం జరిగింది. ఎన్నికల అధికారి చిన్నక్రిష్ణ మొత్తం 94 శాతం ఓటింగ్ జరిగిందని, వాటిలో 7ఓట్లు చెల్లనివిగా గుర్తించినట్లు తెలిపారు. వారిలో నూతన అధ్యక్షుడిగా పోటీ చేసిన కొండపల్లె చిన్నసుబ్బారావుకు 576 ఓట్లు పోల్ అయ్యాయని కేవీ సుబ్బారావుకు 492ఓట్లు వేయగా ఆయన ఎన్నికల్లో ఓడిపోయారన్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కొండపల్లె చిన్నసుబ్బారావుకు ఎన్నికల అధికారి ధృవీకరణ పత్రాన్ని అందజేశారు. అనంతరం తన విజయానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కనుమర్లపూటి ప్రసాద్, డి.సుబ్బరాయుడు, నాగరాజ, శ్రీనివాసులు, నరసింహా, సునీల్, సుబ్బరాజా, వెంకటేశ్వరరావు, నాగరాజా, గోవిందస్వామి, వెంకటరమణ, రాఘవ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అరటితోట కోసేశారని ఫిర్యాదు

మైదుకూరు రూరల్, ఆగస్ట్ 3(ఆంధ్రజ్యోతి) :మైదుకూరు మండలంలోని బోంచన్‌పల్లె గ్రామంలో ఉన్న దేవదాసుకు చెందిన మూడు నెలల అరటి పంటను కోసివేసినట్లు ఆదివారం ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాదాపు 16 వందల అరటి మొక్కలలో సుమారు 12 వందల మొక్కలను కోసివేసినట్లు ఫిర్యాదు లో పేర్కొన్నారని పోలీసులు చెప్పారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం మైదుకూరు పట్టణానికి చెందిన ఎస్ఎల్ఆర్ హాస్పిటల్ వైద్యాధికారి మూలే రామ అనిల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్యశిబిరానికి దాదాపు 200 మందికి పైగా హాజరైనట్లు తెలిపారు. ఈకార్యక్ర మానికి ఎంపీపీ వీరనారయాణరెడ్డి, టీడీపీ అధ్యక్షులు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, స్వచ్ఛంధ సేవా నేతలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దముడియం మండలం గుండ్లకుంట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. మిగిలి ఉన్న ఎస్టీ 2, ఎస్సీ 36 సీట్లు ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకునేవారు విద్యార్థి ఆధార్‌కార్డు, కుల ధృవీకరణ పత్రంతో గుండ్లకుంట గురుకుల పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

విద్యుత్ స్మార్ట్‌మీటర్లు బిగిస్తే ఉద్యమం తప్పదు

కొండాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) విద్యుత్ స్మార్ట్‌మీటర్లు బిగిస్తే ఉద్యమం తప్పదని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. ఈ నెల 5 న ఇందుకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన కరపత్రాలను వారు స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. విద్యుత్ స్మార్ట్‌మీటర్లు బిగించడం ప్రజల ప్రాథమిక హక్కులు కాలరాయటమేనని వారు తెలిపారు. సంస్కరణల పేరుతో ప్రభుత్వం విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటుకు ధారాదత్తం చేయాలని చూస్తోందని ,వెంటనే ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు మనోహర్ బాబు, వెంకటరమణ, సుబ్బారావు, జ్యోతి, పద్మావతి, రామతులసి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివి



జమ్మలమడుగు ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడుగా వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివి అని మండల విద్యాశాఖాధికారి చిట్టిబాబు తెలిపారు. ఆదివారం జమ్మలమడుగులో జరిగిన పతంగే ఫంక్షన్‌లో ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు హాజరై వెంకటేశ్వర్లు ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

పోరుమామిళ్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గానుగపెంట రేపల్లె దళితవాడకు చెందిన ఇస్మాయిల్‌పై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన లక్కినేని ప్రభాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. గాయపడ్డ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కూలీలకు వంద రోజులు పని కల్పించడమే లక్ష్యం



గంగయ్య
ఉపాధి ఏపీవో, ముద్దనూరు

ముఖాముఖి

ముద్దనూరు, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ప్రతి కూలీకి 100 రోజుల పనిదినాలు కల్పించడం లక్ష్యంగా ముందుకు పోతున్నామని ఉపాధి ఏపీవో ఎస్. గంగయ్య పేర్కొన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కాంపౌండ్ వాల్స్, సీసీ రోడ్లకు మెటీరియల్ అందిస్తున్నామని'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ప్రశ్న: మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఎంత మంది ఉన్నారు??

జవాబు: 19గ్రామ పంచాయతీలకు గాను ఒక కొత్తపల్లె గ్రామ పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ ఖాళీగా ఉంది.

ప్రశ్న: మండలంలో ఉపాధి కూలీలు ఎంత మంది ఉన్నారు?

జవాబు: మండలంలో 7557 రిజిస్టర్డైన జాబ్ కార్డులు ఉన్నాయి.అందులో 5865 జాబ్ కార్డులలోని వారికి పనులు కల్పిస్తున్నాము. మొత్తం 9321 మంది కూలీ పనులకు వస్తున్నారు.

ప్రశ్న: ఉపాధిలో ఏఏ పనులు చేపడుతున్నారు?

జవాబు: కొండలు, గుట్టల నందు కందకాలు తవ్వకాలు, రైతుల పొలాల్లో ఫారం పాండ్, పండ్లతోటల పెంపకం,నీటి కుంటలు, చెక్‌డ్యాం, కాల్వల్లో పూడికతీత, నీటితొట్టిలు, ఇంకుడు గుంతలు చేపడుతున్నాం.

ప్రశ్న: కూలీలకు రోజువారి కూలి ఎంత వస్తుంది?

జవాబు: కూలీలకు రోజుకు సరాసరి వేతనం రూ.272 వస్తుంది.ఇచ్చిన కొలతల ప్రకారం పనిచేస్తే ప్రభుత్వం నిర్ధేశించిన రూ.307 వస్తుంది.

ప్రశ్న: కూలీలకు కూలి ఎప్పుడు ఇస్తారు?

జవాబు: 15 రోజుల్లో కూలి డబ్బులు చెల్లించడం జరుగుతుంది.కూలీ బ్యాంక్ ఖాతాలోకి డబ్బులు జమవుతాయి.

ప్రశ్న: ఈ ఏడాది కూలీలకు ఎన్ని పనిదినాలు కల్పిస్తున్నారు?

జవాబు: ఈ ఏడాది3.12 లక్షల పనిదినాలు కల్పించాలన్న లక్ష్యం. ఇప్పటి వరకు 2లక్షల పనిదినాలు కల్పించాం.

ప్రశ్న: కూలీల పని సమయం ఎంత?

జవాబు: కూలీల ప్రతి రోజు 7గంటలు పనిచేసుకోవచ్చు.ఉదయం 6గంటల నుంచి 1గంట వరకు పనిచేసుకోవచ్చు.

వీడని బాలిక హత్యకేసు మిస్టరీ ?



గండికోట రంగనాథస్వామి దేవాలయంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు (ఫైల్‌ఫొటో)

జమ్మలమడుగు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని పర్యాటక ప్రాంతమైన గండికోటలో బాలిక హత్య కేసు మిస్టరీగానే మిగిలిపోతోంది. జూలై 14వ తేదీ గండికోటలోని శ్రీ రంగనాథస్వామి ఆలయం వెనుక బాలిక హత్య జరిగిన విషయం విదితమే. ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికను ప్రియుడు గండికోటకు తీసుకురావడం ఆతర్వాత బాలిక శవమై తేలింది. హత్య జరిగి మరుసటి రోజు జూలై 15వ తేదీ నుంచి పోలీసు ఉన్నతాధికారులు, పోలీసు బృందాలు విస్తృతంగా పరిశీలించినా ఇం త వరకు హత్య ఎందుకు జరిగింది? ఎలా జరిగింది అన్న విషయాలు తేల్చకపోవ డంతో ఇంకా ఈ ఘటన ఎన్నాళ్లు పడుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. పోలీసు ప్రత్యేక బృందం గండికోట ప్రాంతంలో తనిఖీలు చేపట్టడం, టెక్నాలజీ ఎంతగా ఉన్నా హత్య చేసినవారు ఆ టెక్నాలజీకి సైతం అంతు చిక్కకుండా ఉండడం గమనార్హం. పోలీ సు ఉన్నతాధికారులు ఘటనా స్థలాన్ని పలుమార్లు పరిశీలించి సుమారు 500 మందికిపైగా విచారణ చేసినట్లు తెలిసినా ఎందుకు ఘటనపై వివరాలను వెల్లడించలేకపోతు న్నారో కోటి ప్రశ్నలు ప్రజల్లో ఉత్పన్నమవుతున్నాయి. రాజకీయ కారణాలతోనే బాలిక హత్యా సంఘటన ఇంత వరకు వెలుగుతీయలేకపోతున్నారని పలువురు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఇదిలా ఉండగా బాలిక హత్య ఉదంతంతో గండికోట ప్రాంతానికి పర్యాటకులు రావాలన్నా భయపడిపోతున్నారు. పర్యాటక రంగమైన గండికోటలో వసతులు కల్పించినా రక్షణ లేదని చెప్పుకోవడంతో పర్యాటకులు రావడం తగ్గారని సమాచా రం. ఇప్పటికైనా పోలీసు అధికార యంత్రాంగం బాలిక కేసుకు సంబంధించి విచారణ వెంటనే పూర్తి చేసి వివరాలను వెల్లడిస్తే మిస్టరీ వీడుతుందని పలువురు భావిస్తున్నా రు. మరి ఆదిశగా జిల్లా పోలీసు యంత్రాంగం విచారణను వేగవంతం చేసి మిస్టరీని బహిర్గతం చేస్తారని ఆశిద్దాం.

రాజకీయ నిబద్ధతకు నిలువెత్తు సాక్ష్యం ఈశ్వరరెడ్డి



ఈశ్వరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాజకీయ నిబద్ధతకు నిలువెత్తు సాక్ష్యం కామ్రేడ్ ఎద్దుల ఈశ్వరరెడ్డి అని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎద్దుల ఈశ్వరరెడ్డి 39వ వర్ధంతి సందర్భంగా జమ్మలమడుగు పాత బస్టాండులో ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డితోపాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ 1952 నుంచి 1977 వరకు నాలుగు పర్యాయాలు కడప జిల్లా ఎంపీగా, ఒకసారి ఎమ్మెల్సీగా పనిచేసిన ఘనత అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్, పట్టణ కార్యదర్శి రాంప్రసాద్, కోశాధికారి మనోహర్‌బాబు, చేనేత సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, చాంద్‌బాష, నాగేంద్ర, మునిరెడ్డి, మధు, గురుస్వామి, సుబ్బన్న, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



ఈశ్వరరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు టౌన్‌లో: దివంగత ఎంపీ, సీపీఐ నాయకుడు ఎద్దుల ఈశ్వరరెడ్డి 40వ వర్ధంతిని ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ శ్రే ణులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, సీనియర్ నాయకుడు గోపాలం రామకృష్ణలు మాట్లాడుతూ ఆయన పోరాట ఫలితంగానే గండికోట ప్రాజెక్టు ఏర్పాటు అయిందని, అలాగే ఎర్రగుంట్ల ఐసీఎల్ సిమెంటు ఫ్యాక్టరీ, కడప ఆకాశవాణి వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి సుబ్బరాయుడు, చంద్రశేఖర్, మచ్చా శ్రీను, శ్రీనివాసులరెడ్డి, ప్రమీల, సుజాత, పీటర్, ప్రభాకర్, నాగేంద్ర పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: నిస్వార్థ ప్రజాసేవకుడు ఎద్దుల ఈశ్వరరెడ్డి అని సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు రమణారెడ్డి, రవికుమార్‌లు పేర్కొన్నారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో ఎద్దుల ఈశ్వరరెడ్డి 39వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తనకున్న 600 ఎకరాల భూమిని పేద ప్రజలకు పంపిణీ చేయడం, జిల్లాలో ఆకాశవాణి, రేడియోకేంద్రం, రైల్వేస్టేషన్, గండికోట ప్రాజెకు సంక్షేమమే తన ఊపిరిగా పెట్టుకుని చివరి వరకు పోరాడిన వ్యక్తి అని కొనియాడా రు. కార్యక్రమంలో కలసపాడు, బికోడూరు సీపీఐ నాయకులు ఎస్టీయూ నాయకులు చంద్రహాస రెడ్డి, వాకా చంద్రశేఖర్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, శేఖర్‌బాబు పాల్గొన్నారు.


మల్లకతవ ఆక్రమణలను తొలగించండి



సమావేశంలో మాట్లాడుతున్న మండల ఉపాధ్యక్షుడు సీఎంబాషా

పోరుమామిళ్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మల్లకతవ ఆక్రమణలను గుర్తించి పంట కాల్వలను పునరుద్ధరించి పోరుమామిళ్ల చెరువు నుంచి పంట కాల్వలకు నీరు సజావుగా వచ్చేలా చూడాలని మండల ఉపాధ్యక్షుడు సీఎం బాషా, జడ్పీటీసీ ముత్యాలప్రసాద్ అధికారులను కోరారు. ఆదివారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యక్షుడు సీఎంబాషా మాట్లాడుతూ పోరుమామిళ్ల చెరువు పరిధిలో మల్లకతవ గతంలో ఎంతో వెడల్పుగా ఉండేదని, కానీ ప్రస్తుతం ఆక్రమణలకు గురైందని అధికారులు చర్యలు తీసుకుని పునరుద్ధరించాలన్నారు. అలాగే పోరుమామిళలో రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలన్నారు. పోరుమామిళ్లలో ఎక్కువగా యూరియా కొరత ఉందన్నారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ తాగునీటి సమస్య ఎక్కడున్నా తమ దృష్టికి తీసుకునివస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల ఉపధ్యక్షుడు చెన్ను రాజశేఖర్, సర్పంచ్‌లు చిత్రావిప్రకాశ్‌రెడ్డి, రమణారెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, ఎంపీటీసీ కల్వకూరి రమణ, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రంగారావు సేవలు అభినందనీయం



రంగారావు దంపతులను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

పోరుమామిళ్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడుగా సుదీర్ఘకాలం పాటు విద్యారంగానికి బి.రంగారావు చేసిన సేవలు అభినందనీయమని కాశినాయన, రాజంపేట ఎంఈవోలు నిర్మల, రఘునాథరాజు పేర్కొన్నారు., కాశినాయన మండలంలోని వరికుంట్ల జిల్లా పరిషత్ పాఠశాలలో పద్రానోపధ్యాయుడుగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన రంగారావుకు ఆదివారం పోరుమామిళ్ల రీజనల్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు రమణారెడ్డి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పదవీ విరమన పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం కలసపాడు, కాశినాయన, బి.కోడూరు. పోరుమాఇమళ్ల ఎస్టీయు నాయకులు రంగారావును సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూనాయకులు చంద్రహాసరెడ్డి, వాకాచంద్రశేఖర్, సుబ్బారెడ్డి, శేఖర్‌బాబు సత్యనారాయణ, గురయ్య నాలుగు మండలాల ఎస్టీయు కార్యకర్తలు పాల్గొన్నారు.

మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోండి

రాజుపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం వెల్లాల గురుకుల పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్, ఐదో తరగతిలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తులశమ్మ ప్రకటనలో తెలిపారు., జూనియర్ ఇంటర్ ఎంపీసీ గ్రూపులో ఎస్సీలకు 8 సీట్లు, ఓసీకి ఒక సీటు, ఎస్టీలకు 2 సీట్లు ఉన్నట్లు తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 12 సీట్లు ఉన్నాయన్నారు. ఐదోతరగతిలో ఎస్సీలకు 2 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని తెలిపారు. వివరాలకు 9703197899 అనే నెంబరుకు సంప్రదించాలని ఆమె ప్రకటనలో పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోడూరు దుర్గాంబ అమ్మవారికి పూజలు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలంలోని పలుగురాలలపల్లె గ్రామంలో వెలసి ఉన్న కోడూరు దుర్గాంబ అమ్మవారి సన్నిధానంలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అమ్మవారికి ఉదయం 6గంటల నుంచి పూజా కార్యక్రమాలు వైభవంగా చేపట్టారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ప్రజాప్రతినిధులు, మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే సోదరుడు పుత్తాఆనంద్‌యాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లెసుబ్బారెడ్డి, సోమిరెడ్డిపల్లె సహకార సంఘం చైర్మన్‌గా ఎంపికైన సాంబశివారెడ్డి, యువ నాయకుడు కాణాల మల్లిఖార్జునరెడ్డి, ఎస్ఆర్ శ్రీనివాసులరెడ్డి, బాలదుగ్గిరెడ్డి, సర్పంచ్‌లు వేమిరెడ్డిమునిరెడ్డి, చిలమల నారయాణ, పూజాశివ, మేకల సుధాకర్, పుట్టాల శివాయాదవ్, బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ లేక వాహనదారులకు అవస్థలు

జమ్మలమడుగు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు వాహన పార్కింగ్ సౌకర్యంగా లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి రోగులను తీసుకుని వచ్చే 108 వాహనంకానీ, ఆటోలు కానీ రావాలన్నా రోడ్డుపై నిలుపాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ఆస్పత్రి ఆవరణలో బయటి వ్యక్తులు ద్విచక్ర వాహనాలు అడ్డంగా పెట్టి వెళుతున్నారని దీంతో నడవలేని రోగులకు మూడు చక్రాల కుర్చీలో తీసుకొని వెళ్లాన్నా ఇరుకుగా మారింది. అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు వాహనాలు నిలుపుకునే సౌకర్యం కల్పించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.